

—తెనాలి సుశీలాదేవి

"గిరీ! శేషగిరీ"

బయట ఎవరో తలుపులు బాదుతూ పిలుస్తున్నారు. విసుగ్గా చేతిలోని వార పత్రికను మంచం మీదికి గిరవాటు పెట్టి బద్ధకంగా వెళ్ళి తలుపు తీశాను. ఎండ నిప్పులు చెరుగుతూంది. వడగాడ్పు ఈ చెవిలోంచి ఆ చెవిలోకి వేడిగా దూసుకుపోతూంది. ఎంచి ఎండలో వచ్చాడేమో—ముఖం ఎర్రగా కందిపోయి నీరసంగా కనిపిస్తోంది. చేతిలో ఏవో బట్టలున్న చిన్న చేతిసంచీ ఏభై అరవై ఏళ్ళమధ్య ఎంతయినా ఉండచ్చు ఆయన వయసు. ఎక్కడా చూసిన జ్ఞాపకం రాలేదు నాకు. అయినా, ఎండకి అతనిని వీధిలో నిలబెట్టి నే నిలా ఆలోచనలో పడటమేమిటి? ఆలాగని ఎంతో దగ్గరివారే తప్ప గిరీ అని మరెవరూ పిలవరని తెలుసు నాకు.

'లోపలికి రండి.' ముక్కూ మొహమూ తెలియని మనిషిని లోపలికి రమ్మనడానికి సంకోచంగానే ఉంది నాకు.

'శేషగిరి లేడా, అమ్మా?' సంచీ అక్కడున్న టేబిల్ మీద పెడుతూ అన్నాడు ఆయన.

'లేరండి. ఇందాకే ఓ గంట క్రితం ఆఫీసునుండి వచ్చి అర్జంటుగా క్యాంపు వెళ్ళాలంటూ హడావుడిగా భోజనం చేసి ఇప్పుడే వెళ్ళారు. ఆయ నెక్కిన రిక్షా అలా వెళ్ళింది, మీ రిలా వచ్చారు.' చెబుతున్నానే గాని, ఇప్పు డీయనకు అన్నం పెండాలా, వద్దా? మొహం చూస్తే తిన్నట్టు లేదు. అన్నం ఒక మనిషికి సరిపడేలా ఎప్పుడూ మిగలదు. స్టౌ అంటించి బియ్యం పడేస్తే. . . నా ఆలోచనలు పూర్తవలేదు.

'చూడమ్మా, ఎండని భరించలేకుండా ఉన్నాను. ముందుగా స్నానం చేసి వస్తే గాని, భోజనం చేయలేను. కాసిని నీళ్ళు తోడావంటే, చన్నీళ్ళే చాలు సుమా' అంటూ మీదనున్న తుండును సవరించు కుంటూ లోపలికి బయలుదేరాడు. అన్నం చెయ్యక తప్పదు అనుకుంటూ, గబగబా ఆయనకి బాత్‌రూమ్ చూపించి వంటింట్లోకి పరుగెత్తాను. మంచికాలం—కూరా అవీ చాలానే మిగిలాయి ఈవేళ. హడావుడిలో ఆయన భోజనం సరిగ్గా చేయనే లేదు. అన్నం ఒక్కటీ వార్చేస్తే సరి. అన్నట్టు ఎవ రీయన ఇంతకీ? ఆయనకి ఏమవుతారు? ఏమిటో— ఎవరయినా వచ్చినప్పుడు ఈయన ఊళ్ళో ఉండక పోతే అవస్థ. పెళ్ళయిన ఈ అర్నెల్ల లోనూ ఎవరో ఒకరు వచ్చినా తను ఇంట్లో ఉండేవారు గనక సరిపోయేది. నా కాయన వేపు బంధువులు సరిగ్గా తెలియనే తెలియదు. ఆ పెళ్ళిలో ఏం చూశానో, ఏమో కొందరిని. అందులో కొందరు మాత్రమే ముఖ్యమయిన వాళ్ళు బాగా గుర్తుండి పోయారు. మిగతా వాళ్ళు ఎవరికి ఏమవుతారో కూడా తెలియదు. వాళ్ళ ముఖాలూ గుర్తు లేవు. ఇప్పు డీయన ఎవరని ఎలా అడగటం? 'మీ రెవ రండీ' అంటే మర్యాదగా ఉంటుందా!

'ఇదేమిటే, బాబూ, అన్నంకూడా వార్పుకు వచ్చేసింది. ఇంకా ఈయన స్నానం అయినట్టు లేదు.' అంటూ హాల్లోకి వచ్చేసరికి బాత్‌రూమ్ నుంచి ఇవతలికి వచ్చా డాయన. గబగబా వెళ్ళి విస్తరి వేసి వడ్డన పూర్తి చేసి, 'భోజనానికి రండి' అంటూ పిలిచాను. 'ఇదుగో, వచ్చె, వచ్చె' అంటూ పంచను సర్దుకుంటూ పీటమీద కూర్చున్నాడు. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా ఉండి పోయాను.

'అమ్మాయ్! గిరి ఎప్పుడువస్తాడు' తిరిగి అడిగాడు.

'రేపు ఉదయం భోజనం వేళకి వస్తానన్నారండీ.'

'అయ్యో. ఒక్క అరగంట ముందుగా వచ్చి ఉంటే ఎంత బాగుండేది! ఎంత ముఖ్యమయిన విషయం మాట్లాడాలని వచ్చాను! వృథా అయిపోయిందే.'

'రేపే వచ్చేస్తారు గదండీ—మాటాడ వచ్చుగా.'

'అయ్యో నేను అర్జంటుగా పొద్దున్నే ఇల్లు చేరాలి, తల్లీ! లేకపోతే ఒక్క రోజు ఉండటానికి బరువా నాకు. ఏం చెయ్యటం తోచటం లేదే.'

ఆఖరుగా మజ్జిగ పోశాను. మాట్లాడు తూనే ఉన్నా, ఆవురావురు మని తినేశాడు. మిగిలిన అన్నం, మళ్ళీ వండిన అన్నమూ కూడా ఖాళీ అయింది. పాపం, ఎంత ఆకలి గొన్నాడో ఈ ఎండకి? ఇంతకీ ఇత నెవరయింది. . .

'బ్రేవ్' మంటూ ఆయన త్రేన్చే సరికి ఉలిక్కిపడ్డాను.

'ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?' అంటూ అడిగాడు.

---

స్త్రీ హృదయం ఎప్పుడు అనురాగంతో పూర్తిగా నిండి ఉండదు. ఏ మూలనో కాస్త పొగరుకు, ప్రేమకు జాగా ఉంటుంది. —మావా

---

'అబ్బే, ఏం లేదండీ.' మంచం వేసి పక్క పరిచి వచ్చాను పడుకుంటా డేమోనని. ఒక్క మాట మాటాడకుండా క్షణంలో గుర్రు పెట్టాడు. వారపత్రిక తీసుకుని చదువు మొదలుపెట్టాను.

సాయంత్రం అయింది. బయటి కెక్కడికయినా వెడతారేమోనని కాఫీ పెట్టిచ్చాను. త్రాగేసి పేపరు చదువు కుంటూ ఈజీఛెయిర్‌లో పడుకున్నారు. ఎంతయినా పెద్దమనిషి కదా రాత్రికి కూరలతోనే మళ్ళా ఎలా భోజనం పెట్టడం అనుకుంటూ కందిపప్పు పచ్చడి చేసి, బంగాళాదుంపల వేపుడు చేశాను. రాత్రి భోజనాలు మామూలు మాటల తోనే గడిచాయి. పక్కమీద పడుకో బోతూ, 'అమ్మాయ్' అంటూ పిలిచారు. వెళ్ళాను. 'ఒక కాగితం, పెన్ ఇస్తావా? గిరితో మాట్లాడవలసిన విషయం ఉత్తరం వ్రాసి ఇస్తాను. అతడు రాగానే ఇవ్వు. నే నుండి మాట్లాడటానికి వీలు లేకపోయిందని చెప్పు' అన్నారు. . అలాగే ఇచ్చాను. కాసేపు ఏదో వ్రాసుకుని, లైటార్పి పడుకున్నారు.

ఉదయం చీకటితోనే మెలకువ వచ్చింది నాకు. గదిలోంచి వచ్చేసరికి అప్పటికే మేలుకుని మంచం మీద కూర్చుని ఉన్నాడు ఆయన. గబగబా వెళ్ళి బాయిలర్ అంటించి, ముఖం కడుక్కునేసరికి పాలది వచ్చింది. ఇంతలో ఆయన బాత్‌రూమ్ కెళ్ళి ముఖం కడుక్కుని, అలాగే స్నానం కూడా చేసేసి వచ్చాడు. ప్రయాణం అవుతున్నాడనుకుని ఒట్టి కాఫీ ఇవ్వడం ఎలా అనుకుని, త్వరగా అవుతుందని ఉప్మా చేశాను. ఆయన తృప్తిగా తింటూంటే ఎంతో రుచిగా ఉందేమో ఉప్మా అనిపించి మరింత వేశాను. కాఫీ తాగి బయలు దేరారు. వీథి గుమ్మం దాకా వచ్చాక, మడతలు పెట్టిన కాగితం ఇస్తూ, 'చూడమ్మా, వాడు రాగానే ఇది ఇవ్వు. మరవకు. నాడున్నా, లేకపోయినా ఎంతో మర్యాద చేశావు. ఇంతకీ నేనెవరో నీకు తెలుసా? గిరికి బాబాయి నవుతాను నేను. ఉత్తరంలో వ్రాశానులే — తెలుస్తుంది వాడికి. వెళ్ళొస్తానమ్మా' అంటూ ఆయన చేతులు జోడించటం చూసి, 'ఇదేమిటి ఈయన చిన్నదానికి నాకు నమస్కారం చెబుతాడు' అనుకుంటూనే అప్రయత్నంగా నేనూ చేతులు జోడించాను. 'వెళ్ళొస్తా, తల్లీ.' ఒక్క అడుగు వేసి, వెనక్కి తిరిగి మళ్ళీ చెప్పాడు. 'మంచిదండీ.' తల ఊపాను. మరుక్షణం అతను కదిలి పోయాడు. ఆ క్షణంలోనే అతడి కళ్ళలో గిర్రున తిరిగిన నీటిని గమనించాను నేను. 'పాపం, ఏం బాధల్లో ఉన్నారో, ఏమో. తీరా ఇంటికి వస్తే ఈయన లేకపోయారు' అనుకుంటూ లోపలికి వచ్చాను. మరో అర గంటలో క్యాంపు నుండి వచ్చేశారు ఆయన. స్నానం, కాఫీ, టిఫినూ పూర్తయి పేపరు తీసుకుని కూర్చున్నాక అందించాను — 'మీ బాబాయి ఈ ఉత్తరాన్ని ఇచ్చా'డంటూ. 'బాబాయా? ఎవరా బాబాయి' అంటూ గబగబా ఉత్తరం తెరిచారు. ఆయన పక్కగా నిలబడి నేనూ చదివాను.

'బాబూ!

నీ బాబాయినని చెప్పాను. అదయినా నేను వెళ్ళిపోయే ముందు! నిజంగా నే నెవరో, మీ రెవరో? ఎవరని అడక్కుండానే కన్నబిడ్డలా కడుపారా భోజనం పెట్టింది నీ ఇల్లాలు. రైల్లోంచి టికెట్టు లేక దింపారు. మూడురోజులుగా ఎక్కడా అన్నంగాని, డబ్బుగాని దొరక్క ఆకలికి అల్లాడిపోతున్న నిర్భాగ్యుడిని నేను. నాకూ ఒక కొడుకు, కోడలు ఉన్నారు. కాని, ఈ నిర్భాగ్యుడిని తన తండ్రిగా చెప్పుకుందుకు వాడు, మామగారిగా చెప్పుకునేందుకు నా కోడలు అవమాన పడేంత గొప్ప స్థితిలో ఉన్నారు. వాడి నంత గొప్ప స్థితికి తీసుకువచ్చిన నేను ఇలా ఈ వాడు కూటికి అబద్ధమాడే స్థితిలో ఉన్నాను. నీవు రిక్షా ఎక్కి సూట్‌కేస్‌తో వెళ్ళటం చూశాను. మీ ఎదురింటి కెళ్ళి నీ పేరు కనుక్కున్నాను. నీ గుమ్మం ఎక్కి తలుపు కొట్టాను. అన్నపూర్ణే తలుపు తీసింది. నీ భార్య పేరు నాకు తెలీదు. కాని, అన్నపూర్ణలా ఆదరించింది. పోతున్న నా ప్రాణం నిలబెట్టింది. అన్నం కోసం అబద్ధమే చెప్పనక్కర లేదు, అడుక్కున్నా సరిపోతుంది అనే కాలం పోయింది, బాబూ! ఎవరోగాని అన్నం పెట్టగల స్థితిలో లేరు. వేస్తే పిడికెడు బియ్యం, లేదా రెండు పైసలు. ఇవేవీ నా ఆకలి తీర్చే శక్తిని కలిగి ఉండలేదు. కనకనే ఈ పని చేయాల్సి వచ్చింది. నీవు అమ్మాయిని కోప్పడకు, నాయనా, ముక్కూ మొహం తెలియనివాడిని ఇంట్లోకి రానిచ్చి భోజనం పెట్టిందని. ఒక నిర్భాగ్యుడి పోయే ప్రాణం నిలబెట్టిందని ఆ ఇల్లాలిని మెచ్చుకో. తన వారని పొరపడి చేసింది అనుకున్నా నాకు కావలసింది నాకూ దొరికింది. అమ్మాయి చెయ్యి అమృతం. నా జీవితంలో నే నీ భోజనాన్ని మరిచిపోలేను. ఏ నాటికైనా మీ ఋణం తీర్చుకుంటాను. ఈ ఉత్తరం చదివి ఏమయినా వస్తువులుకూడా పట్టుకు పోయాడేమోనని వెదుక్కోకండి, బాబూ! నే నంత నీచానికి పాల్పడలేదు. తిన్న ఇంటి వాసాలు లెక్కించే స్థితికి నే నింకా దిగజారలేదు. అయితే, అబద్ధం చెప్పి ఎందు కింత మోసం చేయటం అంటా వేమో! మూడు రోజులుగా నిజం చెప్పి నా కాలే కడుపుకు ఇంత గంజిని సంపాదించుకోలేకపోయాను. ప్రాణం పోతుం దేమోననే పరిస్థితిలో కడుపు కోసం అబద్ధం ఆడక తప్పలేదు. నా అదృష్టం కొద్దీ సరిగ్గా నీ ఇల్లు దొరికింది నాకు. నిన్న నే నున్న ఆ ఒక్క రోజు నా కొడుకింట్లోనే నే నున్నట్టు, ఆప్యాయంగా నా కోడలు చేసి పెట్టిన భోజనం తింటున్నట్టు అనుభూతి పొందాను. ఈ ఒక్క నాటి అనుభూతి నెమరు వేసుకుంటూనే నా జీవితమంతా గడిపేస్తాను. నా ఊహలు, నా కలలు నే నెప్పుడూ ఆశించే రోజు నిన్న నాకు శాశ్వతమయి నా కళ్ళ ముందు నిలిచి అనుభవాన్నిచ్చింది. అందుకు నేను చచ్చి మీ కడుపున పుట్టి ఋణం తీర్చుకుంటాను. అంతకుమించి ఇప్పటి కేమీ చేయలేను. ఈ నిర్భాగ్యుణ్ణి క్షమించు, నాయనా. అమ్మాయీ, అన్నపూర్ణమ్మ తల్లీ, నీవూ నన్ను క్షమించాలి!

ఇట్లు,
— నీ బాబాయిగా చెప్పుకుని ఒక్క రోజు పరవశించిన ఒక నిర్భాగ్యుడు. *